క్లుప్తంగా

అన్నమాచార్య సాహిత్యం.. యువత చైతన్యం



మాట్లాడుతున్న అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు విభీషణ శర్మ

గూడూరు రూరల్: యువతను చైతన్య పరుస్తూ పదకవితా పితామహుడు అన్నమాచార్య అనేక కవితలు, పద్యాలు రచించారని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు ఆకెళ్ల విభీషణశర్మ అన్నారు. గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో టీటీడీ, డీఆర్‌డబ్ల్యూ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం తాళ్లపాక అన్నమాచార్య జాతీయ సాహితీ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విభీషణశర్మ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతను చైతన్యపరుస్తూ అన్నమాచార్య అనేక సాహిత్యాలు, పద్యాలు రచించారన్నారు. కార్యక్రమంలో ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు, డాక్టర్ కే.మెహర్మణి, విద్యాసాగర్, హనుమంతరావు, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

టీటీడీకి ద్విచక్ర వాహనం వితరణ

తిరుమల: తిరుమల శ్రీవారికి మంగళవారం క్వాంటం ఎనర్జీ లిమిటెడ్ సంస్థ ఎండీ శ్రీ సీ.చక్రవర్తి విద్యుత్ ద్విచక్ర వాహనాన్ని విరాళంగా అందించారు. ఈ వాహనం ధర రూ.1,18,276 అని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ముందుగా ఆలయం వద్ద ఈ వాహనానికి పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాహనం తాళాలను తిరుమల డీఐ జానకీరామ్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ మాజీ బోర్డు సభ్యులు శ్రీభానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం

గూడూరురూరల్: పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించిందని, తమ పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులే విజయఢంకా మోగించారని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం గూడూరులోని తన నివాసంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో 6 వార్డు సభ్యుల స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో 4 స్థానాలు ఏకగ్రీవం కాగా అందులో 3 స్థానాల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులే ఎన్నికయ్యారని చెప్పారు. ఎన్నికలు జరిగిన 2 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థులే గెలుపొందారన్నారు. జనరంజక పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని పవన్ కల్యాణ్ విమర్శించడం సమంజసం కాదని, పద్ధతి మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. పవన్ కల్యాణ్‌కు చిత్తశుద్ధి ఉంటే 175 స్థానాల్లో పోటీ చేయాలని సవాల్ విసిరారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, ఏఎంసీ చైర్‌పర్సన్ ఓ యమునమ్మ, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సునీల్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, చంద్రారెడ్డి, జీనత్, కే అశోక్, జేసీఎస్ కన్వీనర్లు శ్రీహరి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.



గూడూరు రూరల్: సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

గూడూరులో 6 చోట్ల రూ.43 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణాలకు మంగళవారం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈ శ్రీనివాసమూర్తి, నేతలు మురళి, అల్తాఫ్, రాఘవరెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వాకాడు: మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రైతుల అభ్యున్నతే జగనన్న లక్ష్యం

వాకాడు: రైతుల అభ్యున్నతే లక్ష్యంగా జనన్న ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. తెలుగుగంగ కాలవ ఏర్పాటు విషయమై ఎమ్మెల్యే మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఆయన వెంట వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కే దామోదర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు డీ అజిత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,400
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,425
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76.00

నాల్గో అంతస్తు నుంచి కిందపడి కార్మికుడి మృతి



మృతి చెందిన కార్మికుడు గంగ

తిరుపతి రూరల్: పగలంతా కాయకష్టం చేశారు. సాయంత్రం దాకా శ్రమించారు. రాత్రికి ఫుల్‌గా మందు కొట్టారు. తాగిన మత్తులో ఎలాంటి భద్రత లేని నిర్మాణంలో ఉన్న భవనంలో నిద్రించారు. నిద్ర మత్తులో భవనం పైనుంచి పడి శాశ్వతంగా కన్ను మూసి కన్నవారికి తీరని దుఃఖాన్ని మిగిల్చిన ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. తిరుపతి రూరల్ ఎస్‌ఐ పూర్యానాయక్ కథనం.. తిరుపతి రూరల్ మండలం, అవిలాల పంచాయతీ పరిధిలో బెంగళూరుకు చెందిన పారిశ్రామికవేత్త భారీ షాపింగ్ మాల్‌ను నిర్మిస్తున్నాడు. ఒడిశాకు చెందిన గంగా(24) మరికొందరు కార్మికులు సెంట్రింగ్ పనులు చేస్తున్నారు. నిర్మాణంలో ఉన్న షాపింగ్‌మాల్ భవనం నాలుగో అంతస్తులో కార్మికులు నిద్రిస్తున్నారు. మద్యం మత్తులో ఉన్న గంగా సోమవారం అర్ధరాత్రి 11.40 గంటల సమయంలో నాలుగో అంతస్తు నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో తిరుపతి రూరల్ ఎస్‌ఐ పూర్యానాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ పూర్యానాయక్ తెలిపారు.

అమ్మాయిల అదృశ్యం

చిత్తూరు అర్బన్: రెండు రోజుల వ్యవధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐదుగురు అమ్మాయిలు అదృశ్యమయ్యారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. చిత్తూరు మండలంలో గీత, కల్లూరులో నసీబ్, గూడూరులో భువనేశ్వరి, తిరుపతిలో దీపిక అదృశ్యమైనట్లు కేసులు నమోదయ్యాయి.

రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా పీసీ రాయులు

తిరుపతి కల్చరల్: సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడుగా తిరుపతికి చెందిన కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ.రాయులను నియమించినట్లు సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ కే.ముత్యాల నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్ట్ చైర్మన్‌గా డాక్టర్ పీసీ.రాయులు పేదలకు చేస్తున్న సేవలను గుర్తించడంతో పాటు ఎఫ్‌సీఐ, ఎంఎస్‌ఎంఈ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ వంటి శాఖలలోని వివిధ కమిటీలలో పనిచేసిన నేపథ్యంలో ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు.

జగనన్నపాలన దేశానికే ఆదర్శనీయం

వెంకటగిరిరూరల్: ప్రజలకు అతిచేరువలో పారదర్శకమైన పాలన అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సువర్ణ పరిపాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వెంకటగిరి రూరల్ మండలం పంజాం పంచాయతీలో పంజాం దళితవాడ, గిరిజనకాలనీ, గ్రామం, కమ్మపల్లె, లింగమనాయుడుపల్లె గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆయనకు స్థానిక నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రజలు ఇప్పటివరకు ఏఏ పథకాల్లో ఎంత లబ్ధి పొందారన్న అంశాన్ని వివరిస్తూ బుక్‌లెట్‌లు అందజేశారు. ప్రజా సమస్యలను సావధానంగా వింటూ పరిష్కారం దిశగా అధికారులకు దిశానిర్దేశం చేస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి, పార్టీలకతీతంగా, పారదర్శకంగా అర్హతే ప్రామాణికంగా పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు కే శ్రీనివాసులరెడ్డి, నాగయ్య, సర్పంచ్ టీ సిద్ధమ్మ, ఉప సర్పంచ్ మణి, ఎంపీటీసీ సభ్యులు ఈ పెంచలయ్య, నాయకులు టీ శ్రీనివాసులరెడ్డి, పీ ధనంజయ్య, వై పాపిరెడ్డి, సదారెడ్డి, అక్కపల్లి నాగరాజు, పరంధామయ్య, సిద్దారెడ్డి, వేణురెడ్డి, చినగురవయ్య, ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నవరత్నాల ముగ్గును పరిశీలిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీలోకి వార్డు సభ్యుడు



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి పంచాయతీ వార్డు సభ్యుడు ప్రసాద్‌రావు

వాకాడు: మండలంలోని రావిగుంటపాళెం పంచాయతీకి చెందిన టీడీపీ మద్దతుతో గెలిచిన వార్డు సభ్యుడితోపాటు మరో టీడీపీ నాయకుడు మంగళవారం గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దువ్వూరు అజిత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 6వ వార్డులో టీడీపీ బలపరిచిన వార్డు మెంబర్ ఇలప తిరిపాలయ్య, అలాగే టీడీపీ నాయకుడు ఇంగిలాల చిట్టి టీడీపీని వదిలి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. దామోదర్‌రెడ్డి, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఉద్యోగమే లక్ష్యం



రాపూరులో మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: వెంకటగిరి నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ ఉద్యోగ అవకాశం కల్పించడమే లక్ష్యమని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాపూరు తెలుగుగంగ అతిథి గృహంలో రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల నాయకులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సెప్టెంబర్ 8 వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవన్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ జాబ్ మేళాలో 40 కంపెనీలు పాల్గొంటాయని, అందులో 10వ తరగతి నుంచి డిగ్రీ, బీటెక్, ఎంటెక్ వరకు చదివిన నిరోగ్యగ యువతీయకులు జాబ్ మేళలో పాల్గొనవచ్చన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, జెడ్పీ ఉపాధ్యక్షురాలు ప్రసన్న, ఎంపీపీ ప్రసన్న, మాజీ సొసైటీ అధ్యక్షుడు చెన్ను భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

సుదీర్ఘ ప్రయాణం.. ఆపై కునుకు!

- గమ్యానికి ఐదు నిమిషాల్లో చేరుతామనగా..
- చెరువులోకి దూసుకెళ్లిన కారు
- నలుగురికి గాయాలు
- సత్వరం స్పందించిన పోలీసులు



రక్తగాయాలతో బాధితులు



ఫల్టీలు కొట్టిన కారును లేపుతున్న స్థానికులు

తిరుపతి రూరల్: ఎనిమిది వందల కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణం.. బంధువుల ఇంట శుభకార్యం.. కారులో వెళ్లి ఆనందంగా తిరుగుప్రయాణం.. అందరూ హాయిగా నిద్రిస్తున్న సమయం.. మరో ఐదు నిమిషాల్లో గమ్యానికి చెరుకుంటామన్న ధైర్యం.. ఇంతలో అనుకోని ప్రమాదం.. రెండు రోజులుగా విశ్రాంతి లేని డ్రైవింగ్‌తో డ్రైవర్ కునుకు తీశాడు. దీంతో వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పింది. జాతీయ రహదారిపై నుంచి పక్కనే ఉన్న చెరువులోకి ఫల్టీలు కొడుతూ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. తమిళనాడు రాష్ట్రం తంజావూరుకు చెందిన సునీల చాలా ఏళ్ల క్రితమే తిరుపతి జిల్లా రేణిగుంటకు వలస వచ్చి స్థిరపడ్డారు. సొంత ఊరు తంజావూరులో బంధువుల ఇంట్లో శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి కారులో ఆదివారం బయలుదేరి వెళ్లారు. కార్యక్రమం ముగించుకుని సోమవారం రాత్రి తిరుగుప్రయాణమయ్యారు. సుదీర్ఘ ప్రయాణం కావడం.. డ్రైవర్ కునుకు తీశాడు. మరో ఐదు నిమిషాలకు రేణిగుంటకు చేరుకుంటామనగా మంగళవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిపై అవిలాల చెరువుకు సమీపంలో కారు అదుపు తప్పింది. దాదాపు 100 మీటర్ల రోడ్డును క్రాస్ చేసి చెరువులోకి దూసుకెళ్లింది. రెండు సార్లు ఫల్టీలు కొట్టింది. కారులో ఉన్న సునీల, సెల్వీ, భవానీ, ఓ చిన్నారికి గాయాలయ్యాయి. తలకిందులుగా పడి ఉన్న కారులో నుంచి గాయాలతో ఉన్న బాధితులు సాయం కోసం ఆర్తనాదాలు చేశారు. అదే సమయంలో అవిలాల చెరువులో వాకింగ్ చేస్తున్న పాదాచారులు ప్రమాదాన్ని గుర్తించి అక్కడికి చేరుకున్నారు. తలకిందులుగా ఉన్న కారును మాములు స్థితికి చేర్చారు. బాధితులను క్షేమంగా బయటకు తీశారు. అనంతరం గాయపడిన వారిని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తిరుపతి రూరల్ ఎస్‌ఐ పూర్యానాయక్ తెలిపారు. సహాయక చర్యల్లో వేగంగా స్పందించిన రేణిగుంట కానిస్టేబుల్ రాజశేఖర్, తిరుపతి రూరల్ రక్షక్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

విశ్రాంతి తీసుకోండి

సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు కొన్ని నిబంధనలను తప్పకుండా పాటించాలి. ప్రయాణ సమయంలో సీటు బెల్టు పెట్టుకోవాలి. ప్రమాదకర మలుపుల వద్ద నెమ్మదిగా వెళ్లాలి. కునుకు వస్తే వాహనాన్ని పక్కన ఆపి ముఖాన్ని కడుక్కోవడం గానీ, రిఫ్రెష్ కావడం కానీ చేయాలి.

– పరమేశ్వరరెడ్డి, తిరుపతి ఎస్పీ

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గూడూరురూరల్: మండలంలోని కొండాగుంట గ్రామానికి చెందిన పుల్లయ్య(50) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కొండాగుంట గ్రామానికి చెందిన పుల్లయ్య బైక్‌పై గూడూరు వైపు వస్తుండగా పారిచెర్ల గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీ కొన్నాడు. ఈ ఘటనలో గాయపడిన పుల్లయ్యను స్థానికులు గూడూరు ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో అతనిని నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాయుడుపేటలో మరో వ్యక్తి..

నాయుడుపేటటౌన్: మండలంలోని బిరదవాడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బండి పవన్‌కుమార్(20) మంగళవారం రాత్రి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన పవన్ కుమార్ ఈ నెల17 తేదీ బైక్‌పై నాయుడు పేటకు వెళ్లి తిరిగి వస్తుండగా చెన్నై వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఇతని బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన పవన్‌కుమార్ తిరుపతి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


గోకులకృష్ణ ఫార్మశీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



మాట్లాడుతున్న దివీస్‌ల్యాబోరేటర్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి హరికృష్ణ

సూళ్లూరుపేట: పట్టణంలోని గోకులకృష్ణ ఫార్మశీ కళాశాలలో మంగళవారం ప్రముఖ బల్క్ డ్రగ్ సంస్థ దివీస్ ల్యాబోరేటరీస్ లిమిటెడ్ ప్రతినిధులు మంగళవారం ప్రాంగణ ఎంపికలు చేపట్టారు. ఈ ఎంపికలకు 40 మంది హాజరయ్యారు. దివీస్ ల్యాబోరేటరీస్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు సీనియర్ హెచ్‌ఆర్‌లు కే హరికృష్ణ, బీ తిరుపతయ్య, కే శివనవీన్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూకు హాజరైన వారందరూ ఎంపికయ్యారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో ఫార్మశీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బాలగాని పవన్‌కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శివకుమార్ పాల్గొన్నారు.

మణిపూర్ శరణార్థులకు రూ.7లక్షల విరాళం



పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులకు చెక్కు అందజేస్తున్న అధ్యక్షుడు పూలా రవికుమార్

గూడూరురూరల్: మణిపూర్ శరణార్థులను ఆదుకోవాలనే లక్ష్యంతో గూడూరు డివిజన్ పాస్టర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.7 లక్షలు విరాళం అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు దైవ జనులు పూలా డానియేల్ రవికుమార్ తెలిపారు. ఈమేరకు మంగళవారం రూ.7లక్షల చెక్కును అసోసియేషన్‌లోని ముగ్గురు సభ్యులకు అప్పగించి అక్కడికి వెళ్లే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ కె.పి.లూథర్‌బాబు, సెక్రటరి ఎం.రవికుమార్, జాయింట్ సెక్రటరి బ్రదర్ డి.శరత్ బాబు, ట్రెజరర్ వి.అబ్రహాం, సభ్యులు లాజరస్, నెల్సన్, డి.రమణయ్య, బ్రదర్ టి.జె.మార్క్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటింటి సర్వేపై పరిశీలన



రుద్రవరంలో విచారణ జరుపుతున్న ప్రత్యేకాధికారి సతీష్

కోట: మండలంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేను మంగళవారం నియోజకవర్గ ప్రత్యేకాధికారి సతీష్ పరిశీలించారు. కోట, నెల్లూరుపల్లె, కొత్తపాళెం, ఊనుగుంటపాళెం, రుద్రవరం గ్రామాల్లో బీఎల్వోలు చేస్తున్న సర్వేను పరిశీలించారు. తొలగించిన ఓటర్లకు సంబంధించి స్థానికులను విచారించారు. ఆయన మాట్లాడుతూ పటిష్ట విధానాలతో పారదర్శకమైన ఓటర్ల జాబితాను తయారు చేస్తున్నామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. తొలగించిన ఓట్లు సక్రమమేనా? అన్న విషయంపై మాత్రమే గూడూరు నియోజకవర్గంలోని అన్నీ మండలాల్లో విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. ఫిర్యాదులు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. తహసీల్దార్ పద్మావతి పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ



అవగాహన కల్పిస్తున్న లేబర్ కమిషనర్ సురేష్

వాకాడు: మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో మంగళవారం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సురేష్ తన బృందంతో కలసి తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో చిన్న పిల్లలతో వెట్టి చాకిరి చేయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన గ్రామంలోని ప్రతి దుకాణాన్ని పరిశీలించి అవగాహన కల్పించారు. ఆయన వెంట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు సత్యనారాయణ, అనిల్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది సెల్వరాజ్, భాస్కర్, తదితరులు ఉన్నారు.

వలంటీర్లు బాధ్యతగా పని చేయాలి



ఇంటర్వ్యూలు చేస్తున్న అధికారులు

పెళ్లకూరు: కొత్తగా నియమితులైన వలంటీర్లు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్ల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించి, అభ్యర్థులను ఎంపిక చేశారు. అనకవోలు, కలువకూరు, నెలబల్లి, చెన్నప్పనాయుడుపేటలో ఒక్క వలంటీర్ పోస్టు, పెళ్లకూరు రెండు, మొత్తం 6 పోస్టులకు సంబంధించి 18 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో ఎంపికైన వలంటీర్లుకు గుర్తింపు పత్రం అందజేసి, అభినందనలు తెలిపారు. వలంటీర్లు తమ పరిధిలో ఉన్న 50 కుటుంబాలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు.

యూపీ స్కూలు కొనసాగించాలి

చిల్లకూరు: మండలంలోని అన్నంబాకలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ మల్లికార్జునరెడ్డి మంగళవారం చిల్లకూరులోని ఎమ్మార్సీలో ఎంఈఓ సనత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ విద్యా విధానంలో ప్రభుత్వం తీసుకుని వచ్చిన మార్పులతో తమ గ్రామంలోని 4 నుంచి 7 తరగతుల వరకు చదువుతున్న విద్యార్థులను 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిక్కవరం, చిట్టేడు, వల్లిపేడులోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారన్నారు. అయితే విద్యార్థులు అంతదూరం వెళ్లలేక డ్రాపౌట్‌లుగా మారుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో తమ గ్రామంలోనే యూపీ స్కూలును కొనసాగించాలని కోరారు. ఎంఈఓ మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసం ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరిరూరల్: స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో 2023–24 సంవత్సరం మూడో విడత ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ఉమారాణి మంగళవారం తెలిపారు. ఫిట్టర్, మెషినిస్ట్, మెకానిక్ డీజిల్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషన్ టెక్నిషియన్, టర్నర్, వెల్డర్ ట్రేడ్‌లకు దఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు రెండు సంవత్సరాలు, పదో తరగతి ఫెయిల్ అయిన వారికి ఏడాది ట్రేడ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీఓవి.ఇన్‌లో ఈనెల 27వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 28వ తేదీన వెరిఫికేషన్ జరుగునున్నట్లు తెలిపారు. వివరాలకు 98664 20415, 94418 50595 నంబర్లలో సంప్రదించాలన్నారు.

డీ రిజిస్టర్‌లో నమోదు చేయాలి

వెంకటగిరిరూరల్: గిరిజనులకు పంపిణీ చేసిన అసైన్ పట్టాలను రెవెన్యూ అధికారులు డీ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలని జిల్లా గిరిజన ఐక్యవేదిక అధ్యక్షుడు మోపూరు అడవయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని వెంకటగిరి, బాలాయపల్లె, డక్కిలి మండలాల్లో కొంతమంది గిరిజనులకు అసైన్ పట్టాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, కానీ డీ రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంతో గిరిజనులు నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఈ మేరకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.

సర్వజనులకు సంజీవని

ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేస్తోంది. ఖర్చును లెక్క చేయకుండా రూ.కోట్ల నిధులు కేటాయిస్తోంది. సర్వజనాస్పత్రుల అభివృద్ధికి నాడు–నేడు పథకం అమలు చేసి, సకల సౌకర్యాలు కల్పించింది. వైద్యసిబ్బందిని నియమించింది. ఫలితంగా సర్కారు ఆస్పత్రి సర్వజనులకు సంజీవనిగా మారింది.

- డీవీ సత్రం పీహెచ్‌సీలో అత్యాధునిక వసతులు
- రోగులకు మెరుగైన వైద్యం



దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

దొరవారిసత్రం: స్థానిక పీహెచ్‌సీలో ఒకప్పుడు కనీస వసతులు కరువై రోగులకు సరైన వైద్యం అందేది కాదు. రోగులే సూదులు(సిరంజ్)లు బయట కొనుగోలు చేసి తెచ్చుకుని వేసుకోవాల్సిన దుస్థితి ఉండేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి పెద్దపీట వేశారు. దీంతో పీహెచ్‌సీలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి.

24 గంట ఆస్పత్రిగా మార్పు

దొరవారిసత్రం పీహెచ్‌సీ జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో 24 గంటల ఆస్పత్రిగా మార్చారు. పీహెచ్‌సీ పరిధిలో ఎనిమిది విలేజ్ హెల్త్ క్లినిక్ కింద 26,642 మంది జనాభా ఉన్నారు. వీరి కోసం ఇద్దరు వైద్యులు, ఆస్పత్రిలో 14 మంది సిబ్బంది, క్షేత్రస్థాయిలో 24 మంది వైద్య సిబ్బందితో పాటు 23 మంది ఆశా వర్కర్లు ఉన్నారు. పీహెచ్‌సీకి వైద్యం కోసం నిత్యం 100 నుంచి 130 మంది రోగులు వస్తారు. ఆస్పత్రి తొలివిడత నాడు–నేడు పథకం ఎంపికైంది. దీంతో రూ.50లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో భవ నాల మరమ్మతు, పడకలు, మరుగుదొడ్లు, ఫర్ని చర్, తాగునీటి(ఆర్‌ఓఆర్) వసతి, ఆస్పత్రి ఆవరణలో సీసీ రోడ్లు తదితర వసతులన్నీ కల్పించారు. విద్యుత్ పునరుద్ధరణ, ఇన్వర్టర్ సదుపాయం కల్పించారు. రక్త పరీక్షల కోసం డిజిటల్ ల్యాబ్ ఏర్పాటు చేశారు.



డీవీ సత్రం పీహెచ్‌సీలో ఇన్‌పేషంట్‌ను పరీక్షిస్తున్న వైద్యులు



డిజిటల్ ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నిషియన్

పీహెచ్‌సీలోనే ఖరీదైన రక్త పరీక్షలు

డీవీ సత్రం పీహెచ్‌సీలోని డిజిటల్ ల్యాబ్‌లో ఖరీదైన రక్త పరీక్షలు సైతం ఉచితంగానే రోగులకు అందుబాటులోకి వచ్చాయి. హెచ్‌బీ, ఆర్ఎఫ్‌టీ, కిడ్నీ, టైఫాయిడ్, మలేరియా, ఎల్ఎఫ్‌టీ, లివర్, కొలస్ట్రాల్ తదితర రక్త పరీక్షలు చేస్తున్నారు. గర్భిణులకు హెచ్‌బీ, షుగర్, హెచ్ఐవీ, వీడీఆర్ఎల్, హెచ్‌బీఎస్,యూరిన్‌తదితర పరీక్షలన్నీ ఉచితంగా చేస్తున్నారు. తద్వారా స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రి లోనే వైద్యం చేయించుకుంటున్నారు.

వసతులు మెరుగు పడ్డాయి



డీవీ సత్రం పీహెచ్‌సీలో రోగులకు కోసం వసతులు బాగా మెరుగుపరిచారు. ఆస్పత్రిలో మంచి వాతవరణంతోపాటు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. అత్యవసర సమయాల్లో కూడా పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు వైద్యులు నుంచి సిబ్బంది వరకు చాలా మార్పులు వచ్చాయి. నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయి.

-యూ వెంకటయ్య, ఏకొల్లు

మెరుగైన వైద్యం



డీవీ సత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్యం అందుతోంది. రోగుల సౌకర్యార్థం పీహెచ్‌సీలో అన్ని వసతులు కల్పించడంతోపాటు నిత్యం రక్త పరీక్షలు చేస్తున్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులకు నాణ్యమైన మందులు అందుబాటులో ఉంచి, రోగులకు ఇస్తున్నారు. మంచి వైద్యం అందుతుండడంతో రోగులు ప్రభుత్వాస్పత్రి వైపు మొగ్గు చూపుతున్నారు.

- టీ యల్లయ్య, కొత్తపల్లె

అందుబాటులో అత్యవసర వైద్యసేవలు



అత్యవసర పరిస్థితిలో ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగికి తక్షణమే అత్యవసర వైద్యం అందిస్తున్నాం. గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలకు కృషి చేస్తున్నారు. ఇన్‌పేషంట్ల కోసం ప్రభుత్వం సౌకర్యవంతమైన బెడ్లు ఏర్పాటు చేసింది. వైద్య సిబ్బంది అన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకుంటూ వైద్యం అందిస్తున్నారు. పాము, కుక్క కాటు కూడా మందులు అందుబాటులో ఉంచాం.

- వీ చైతన్య, వైద్యాధికారి, డీవీ సత్రం

చందనాలంకరణలో లక్ష్మీనరసింహుడు





శాంతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు , బంగారు గరుడ వాహనంపై లక్ష్మీనరసింహుడు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి మంగళవారం చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతినక్షత్రం కావడంతో స్వామివారి మూలమూర్తికి చందనంతో అలంకరించారు. స్వామివారికి ఉదయం అభిషేకం, చందన అలంకరణ, నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని బంగారు గరుడ వాహనంపై కొలువు తీర్చి, మేళతాళాలు మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛాణల నడుమ పెంచలకోనలోని మాఢవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

మాతాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు



అంబళ్లు పోసి, పూజలు చేస్తున్న భక్తులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని అగ్రహారపేట అరుంధతీయవాడలో ఉన్న మాతాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. బుధవారం నుంచి ఆదివారం వరకు ఐదు రోజులు పాటు అమ్మవారి కొలుపు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఆలయం వద్ద అమ్మవారి భక్తులు అంబళ్లు పోసి, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కొలుపు 13 ఏళ్ల తరువాత ఘనంగా నిర్వహిస్తున్నామని పూజారి ఎం బాబు వెల్లడించారు. నిర్వాహకులు మాట్లాడుతూ బుధవారం ఉదయం అమ్మవారికి ముడుపులు, అంబళ్లు, రాత్రి పుట్ట బంగారం కథ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గురువారం ఉదయం పోతురాజు ముగ్గులు, రాత్రి అస్సల పర్వత యుద్ధం కథ, శుక్రవారం ఉదయం పరశురాముని ముగ్గు, మధ్యాహ్నం తపస్సుమాను, తపస్సువనం, పరశు రాముని యుద్ధ ఘట్టాలు నిర్వహిస్తామన్నారు. శనివారం మధ్యాహ్నం గొల్లభామల చల్ల అమ్ముట కథ, రాత్రి గౌరమ్మ కల్యాణం, ఆదివారం ఉదయం మాతమ్మ ముగ్గు, రాత్రి అగ్నిగుండ ప్రవేశం, అమ్మవారి ఊరేగింపులతో కొలుఉపు ముగుస్తుందని తెలిపారు. ఈ పూజల్లో కౌన్సిలర్ పీ నాగార్జున, డీ రవి, ఏ నాగరాజు పాల్గొన్నారు.

అన్నదానం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు మంగళవారం వై రంగనాయకులమ్మ కుటుంబ సభ్యులు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. నిర్వాహకులతోపాటు దాతలు సైతం వృద్ధుల కలసి సహపంక్తి భోజనాలు చేశారు. వై రామమూర్తి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీవీ రామన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీ గోపీ, ఆశ్రమ నిర్వాహకులు సునీత, బెన్ని పాల్గొన్నారు.

రీసర్వే సకాలంలో పూర్తి చేయండి



మాట్లాడుతున్న డీజీపీఓ రాజశేఖర్

పెళ్లకూరు: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం కింద చేపట్టి రీసర్వే పనులను సకాలంలో పూర్తి చేయాలని డీజీపీఓ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాళ్వాయిపాడు, పెన్నేపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన భూరీసర్వేని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంతో భూ సమస్యలు తొలగిపోతాయన్నారు. భూ రీసర్వే పనులను వేగవంతానికి గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు అధికారులకు సహకరించాలన్నారు. సర్వేయర్లు రీసర్వే పూర్తి చేసిన అనంతరం కేటాయించిన యునిక్ నంబర్ ఆధారంగా రైతులకు భూహక్కు పత్రం, పట్టాదారు పాసుపుస్తకం పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఏల్‌పీఓ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు శ్రీహరి, జనార్దన్, వీఆర్వో వంశీ పాల్గొన్నారు.

డీవీ సత్రంలో..

దొరవారిసత్రం: శ్రీధనమల్లి పంచాయతీ పరిధిలోని మానేరి గ్రామంలో స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా డీజీపీఓ రాజశేఖర్‌రెడ్డి హౌస్ సర్వే పనులను మంగళవారం తనిఖీ చేశారు. అలాగే రీసర్వే పనులు తీరును కూడా ఆయన పరిశీలించారు. రీసర్వే పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌మస్తాన్, సర్వేయారు మానిక, డిజిటల్ అసిస్టెంట్ పోలయ్య, సిబ్బంది ఉన్నారు.

వంద రోజులు పని కల్పించాలి



అవగాహన కల్పిస్తున్న ఏపీఓ ఉషారాణి

ఓజిలి: ఉపాధిహామీ పథకంలో ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని ఏపీఓ ఉషారాణి ఆదేశించారు. మండలంలోని ఆర్మేనిపాడులో ఉపాధిహామీ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఇచ్చే కొలత ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.272 కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. గతంలో ప్రభుత్వం కూలీలకు రోజుకు రూ.257 నగదు ఇచ్చేదని, ఈ ఏడాది మరో రూ.15 పెంచిందన్నారు. కూలీలు ప్రతిరోజు పనికి వెళ్లాలని, జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పనులు కల్పించాలని ఆదేశించారు. రైతులకు ఉపయోగపడే ఒరవ, పంట కాలువలను శుభ్రం చేయడంతో చెరువుల్లోకి సాగునీరు వెళ్లేందుకు సులువుగా ఉంటుందన్నారు. నీటి గుంటలు, చెరువు కట్టల పనులతో మూగజీవాలకు వర్షాకాలంలో నీరు లభిస్తుందన్నారు. పనులకు హాజరయ్యే కూలీలకు మాత్రమే మస్టర్ నమోదు చేయాలని, పనులు పరిశీలించే క్రమంలో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమె వెంట టీఏ మహేష్‌కుమార్, ఎఫ్ఏ కృష్ణ తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

వాకాడు: మండలంలోని గంగన్నపాళెంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామానికి చెందిన ఎం సుగుణమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు, ఉప సర్పంచ్ ఎం కిరణ్‌కుమార్‌రెడ్డి నెల్లూరుకు చెందిన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణుల సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో వైద్యులు సుమారు 150 మందికి ఉచితంగా పరీక్షలు చేయించి మందులు అందజేశారు. కంటి ఆపరేషన్లు అవసరమైన 30 మందికి తన సొంత నిధులతో చేయిస్తామని కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, సర్పంచ్ పుల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్‌కు చేరిన మట్టి కలశాలు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ తదితరులు

డక్కిలి: నాభూమి–నాదేశం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అన్ని గ్రామాల నుంచి ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు సేకరించిన మట్టిని కలిశాలలో నింపి, స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేర్చారు. అనంతరం ఈ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఎంపీపీ జీ రాజశేఖర్ మాట్లాడుతూ అజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ నెల ఒకటి నుంచి 15వ తేదీ అన్ని గ్రామాల్లో స్వాతంత్ర్య సమరయోధుల పేర్ల శిలఫలకాల ఆవిష్కరణ, ర్యాలీలు, మొక్కలు పెంపకం తదితర కార్యక్రమాల నిర్వహించామన్నారు. అలాగే అన్ని గ్రామాల్లో మట్టిని సేకరించి, కలశాలలో నింపి, నియోజకవర్గం కేంద్రమైన వెంకటగిరికి తరలిస్తున్నట్లు చెప్పారు. అనంతరం నాభూమి–నాదేశం ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఏపీఓ లక్ష్మీనారాయణ, ఈసీ దామోదరరాజు, టెక్నికల్ అసిస్టెంట్‌లు షఫీ, గిరి పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం నేడు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని 21వ వార్డులో బుధవారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ వార్డు కౌన్సిలర్, పార్టీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 25 తేదీ వరకు నిర్వహించే ఆధార్ ప్రత్యేక సేవలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న గరిడీవీధి సచివాలయంలో మంగళవారం మరో మూడు సచివాలయాలకు కలిపి ఆధార్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ బుధవారం లోతువానిగుంట సచివాలయం వద్ద జరిగే ఆధార్ ప్రత్యేక క్యాంపులో ఆ సచివాలయంతోపాటు ఎల్ఏ సాగరం, బీఎంఆర్ నగర్, భూపయ్య కాలనీ సచివాలయాలకు సంబంధించిన వారు ఆధార్ సేవలు పొందవచ్చన్నారు. అలాగే గురువారం మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న ఆర్యుగం నగర్ సచివాలయంలో జరిగి ఆధార్ క్యాంపులో బేరిపేట, శంకరాపురం సచివాలయల వారు, శుక్రవారం తుమ్మూరు ఉన్న భరత్ నగర్, తుమ్మూరు సచివాలయలకు సంబంధించి ఆధార్ సేవలు అందించనున్నట్లు చెప్పారు.

ఆర్థిక స్థిరత్వం సాధించాలి

చిల్లకూరు: పొదుపు గ్రూపుల్లోని మహిళలు ఆర్థిక సిర్థత్వాన్ని సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం గున్నయ్య తెలిపారు. చిల్లకూరులోని సంఘ మిత్ర కార్యాలయంలో మంగళవారం మండలంలోని సంఘమిత్ర, సంఘం బంధం అధ్యక్షులు, వీఓఏలకు ఆర్థిక స్థిరత్వంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పొదుపు గ్రూపులోని సభ్యులు చిన్న మొత్తాలతో మొదలుపెట్టి పెద్దస్థాయిలో బ్యాంకుల ద్వారా రుణాలు పొందే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఇందుకు ప్రతి గ్రూపులోని సభ్యులు ఆర్థిక క్రమశిక్షణ కలిగి నడుచుకోవాలన్నారు. బ్యాంకులో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా అధిక మొత్తంలో రుణాలు పొందవచ్చన్నారు. ఇలాంటివి సమష్టిగా తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నారు. గ్రూపులోని సభ్యులు సమష్టిగా వ్యాపారం చేస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చన్నారు.

చెరువు నీరు వదిలేశారని పోలీసులకు ఫిర్యాదు

సైదాపురం: మండలంలోని పొక్కందల గ్రామంలో ఉన్న చెరువు తూము నుంచి నీటిని కొందరు వృథాగా వదిలేశారని మంగళవారం ఇరిగేషన్ ఏఈ చిన్నయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఏఈ చెరువు వద్దకు చేరుకుని రైతులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెరువులో ఉన్న నీటిని ఎలాంటి అనుమతులు లేకుండా వదిలివేయడం ఏమిటని ప్రశ్నించారు. తద్వారా సాగునీటికి కొరత కూడా వచ్చే ప్రమాదం ఉందని ఆయన చెప్పారు. నీరు వదిలే ముందు గ్రామస్తులందరూ చర్చించుకుని నీటి వదిలి ఉంటే ఎంతో బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఎవరికీ తెలియకుండా నీటి వదిలివేయడం నేరమని అన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశామని ఆయన చెప్పారు. ఇక ఎవరైనా నీటిని వదిలి వేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

